# మంచి వార్త

## ప్రకృతిని రక్షిస్తేనే మనుగడ

**అది 2012...** కేరళకు చెందిన రాధాకృష్ణన్ నాయర్ జీవితం మలుపు తిరిగిన సంవత్సరం. గుజరాత్‌లో ఓ రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా వందలాది చెట్లు నరికివేస్తున్న దృశ్యం ఆయన కంటపడింది. ఆ సమయంలో నాయర్ ఓ చెట్టు మీది నుంచి పక్షిగూడు గుడ్లతోపాటే కిందికి పడిపోవడం చూశాడు. అసహాయంగా అరుస్తున్న పక్షుల అరుపులు ఆయన మనసులో అలానే ఉండిపోయాయి. ''పక్షుల అరుపులు వాటికోసం ఓ అడవిని సృష్టించాలన్న విషయాన్ని గ్రహించేలా చేశాయి'' అంటాడు నాయర్. ఆయన స్వగ్రామం కేరళ రాష్ట్రం కాసర్‌గోడ్. తన నాలుగో ఏట నాయర్ కర్ణాటక రాష్ట్రం మంగళూరు జిల్లాలోని ఓ గ్రామానికి వలస వెళ్లాడు. అక్కడే పచ్చటి ప్రకృతి మధ్య పెరిగి పెద్దవాడయ్యాడు. అలా పర్యావరణ పరిరక్షణ అనేది ఆయన జీవితంలో ఓ భాగమైపోయింది. నాయర్ తర్వాత పనికోసం ముంబయికి మారిపోయాడు. వస్త్ర పరిశ్రమలో ఉద్యోగంలో చేరిపోయాడు. ఆ తర్వాత గుజరాత్ తీరప్రాంత గ్రామం ఉమర్‌గాంకు ప్రమోషన్ మీద వెళ్లాడు. ఓ పదేళ్లు అక్కడే పనిచేసిన నాయర్ సొంతంగా రెడీమేడ్ అంగీల వ్యాపారం మొదలుపెట్టాడు. శ్రీ పౌర్ణిక ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించాడు. అయితే పక్షుల అరుపులు ఆయనకు ఇంకా అలానే గుర్తుండిపోయాయి. వాటికోసం ఏదైనా చేయడానికి ఉమర్‌గాంలో కొంత స్థలం కొన్నాడు. అందులో మియవాకి పద్ధతిలో 1,500 మొక్కల్ని నాటాడు. అతి తక్కువకాలంలో తక్కువ స్థలంలోనే దట్టమైన అడవులను పెంచే ఈ మియవాకి పద్ధతిని జపాన్‌కు చెందిన వృక్షశాస్త్రజ్ఞుడు అకీరా మియవాకి అభివృద్ధి చేశాడు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న పని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఆకర్షించింది. ఓ డంపింగ్ యార్డులో అడవిని పెంచాల్సిందిగా నాయర్‌ను మహారాష్ట్రకు ఆహ్వానించింది. ప్రభుత్వం సూచించిన ప్రదేశంలో ఆయన 30,000కు పైగా మొక్కలు నాటాడు. అప్పటినుంచి రాధాకృష్ణన్ నాయర్ పన్నెండు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాడు. 80కి పైగా పట్టణ అడవులను సృష్టించాడు. అలా నగరాల్లో పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడుతున్నాడు. ''ఈ అడవుల్లో ఎన్నో ఔషధ మొక్కలు పెరుగుతున్నాయి. మనం ప్రకృతికి సేవ చేస్తేనే, మనల్ని ప్రకృతి చల్లగా చూస్తుంది'' అన్నది రాధాకృష్ణన్ అభిప్రాయం. ఇది నూటికి నూరుపాళ్లు నిజం.



## వైతాళికుల వాణి

తనను తాను నియంత్రించుకునే మనిషి శక్తిమంతుడు. అలాంటివాడు అన్ని సమయాల్లోనూ తలెత్తుకునేలా ఉండగలుగుతాడు.

• **నార్మన్ విన్సెంట్ పీల్**
(సానుకూల దృక్పథ ప్రచారకుడు)

## క్యా సీన్ హై!

